GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 7 | సంచిక :120 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | శనివారం 18-01-2025 | పేజీలు : 3

## బస్సును మినీ వ్యాన్ ఢీకొని
# 9మంది మృతి



**టీ మీడియా, జనవరి 17,పూణే:** పూణే-నాసిక్ హైవేపై మినీ వ్యాన్, బస్సు ఢీకొని ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 9 మంది మరణించారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు నారాయణగావ్‌లో ఈ ప్రమాదం జరిగింది. జున్నార్ గ్రామాల నుండి ప్రజలను తీసుకెళ్తున్న వ్యాన్ ప్రమాదానికి గురైంది. ట్రక్కు వెనుక భాగాన్ని ఢీకొట్టిన మినీ వ్యాన్ నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కన ఆగి ఉన్న బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వ్యాన్ పూర్తిగా ధ్వంసమైంది. వ్యాన్ ప్రయాణికులతో నారాయణగావ్‌కు వెళుతోంది. బ్రేక్‌డౌన్ కారణంగా బస్సును హైవే పక్కన నిలిపివేశారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో ప్రయాణికులు లేరు.

# నిషేధిత భూములపై మంత్రివర్గ ఉపసంఘం

- పేదలకు గ్రామీణంలో 3 సెంట్లు
- అర్బన్ ప్రాంతంలో 2 సెంట్లు భూమి
- ధాన్యం కొనుగోలు కోసం 700 కోట్ల రూపాయల రుణం
- ఎ పి కేబినెట్ లో నిర్ణయం



**టీ మీడియా, జనవరి 17, అమరావతి బ్యూరో** : నిషేధిత జాబితా నుంచి అక్రమంగా తొలగించిన భూములపై నిర్ణయం తీసుకునేందుకు మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటుకు కేబినెట్ నిర్ణయించింది. వైఎస్సార్సీపీ హయాంలో దాదాపు 7 లక్షల ఎకరాల భూములు నిషేధిత జాబితా నుంచి తొలగించారు. దీనిపై అధ్యయనం చేసి ఆయా భూములను ఏం చేయాలన్న దానిపై మంత్రుల కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. ఎన్నికల హామీ మేరకు పేదలకు స్థలం ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.గ్రామీణంలో 3 సెంట్లు, అర్బన్ ప్రాంతంలో 2 సెంట్లు భూమి ఇచ్చేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మత్స్యకార భరోసా అమలుకు సిద్ధం కావాలని నిర్దేశించారు. పోలవరం డయాఫ్రమ్ వాల్ వెంటనే ప్రారంభమవుతుందన్న సీఎం అమరావతి పనులు కూడా వెంటనే మొదలవుతాయని తెలిపారు. మంత్రివర్గ సమావేశం తర్వాత పలు రాజకీయ అంశాలపై చర్చ జరిగింది. తీసుకునేందుకు ఏపీ మార్క్ఫెడ్ కు ప్రభుత్వ హామీ ప్రతిపాదన పై కేబినెట్ లో చర్చజరిగింది. అలాగే గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగుల రేషనలైజేషన్ ప్రతిపాదనపై చర్చ జరగింది. గ్రామ వార్డు సచివాలయాల్లో రియల్ టైం గవర్నెన్స్ వ్యవస్థ ఏర్పాటు కు సంబంధించి మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నారు. ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలకు ఎలక్ట్రిసిటీ డ్యూటీ టారిఫ్ తగ్గింపు ప్రతిపాదన పై చర్చించారు.అలాగే నాగావళి నది పై గౌతు లచ్చన్న తోటపల్లి బ్యారేజ్ పై కుడి, ఎడమ వైపు మిని హైడల్ ప్రాజెక్టుల నిర్మాణం ప్రతిపాదన కు కేబినెట్ ఆమోదం తెలిపింది. కడప జిల్లా సీకే దిన్నె మండలం లో ఏపీ ఇండస్ట్రియల్ కారిడార్ ఇన్ఫ్రా కార్పొరేషన్ కు కేటాయించిన 2595 ఎకరాల బదిలీ కి స్టాంపు డ్యూటీ మినహాయింపు ప్రతిపాదన పై కేబినెట్ లో నిర్ణయం తీసుకున్నారు. అభ్యంతరం లేని ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణ ప్రతిపాదన పైనా కేబినెట్?లో చర్చించారు.కేబినెట్?లో చర్చించిన అంశాలను మంత్రి కొలుసు పార్థసారధి వెల్లడించారు. ప్రతి రైతుకు సేకరించిన ధాన్యానికి 24 గంటల్లో చెల్లించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని తెలిపారు. ఇప్పటికే రైతుల ఖాతాల్లో రూ.6200 కోట్లు జమ చేశామని గుర్తు చేశారు. ఈ సీజన్‌లో 4.6 లక్షల రైతుల నుంచి 28.83 లక్షల టన్నుల ధాన్యం సేకరించామన్నారు. మిగిలిన ధాన్యాన్ని రైతుల నుంచి సేకరిస్తామని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర చెల్లించాలని సీఎం ఆదేశించారన్నారు. విద్యుత్ సుంకంలో టారిఫ్‌ల తగ్గింపును మార్చి వరకు పొడిగింపునకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. దీనివల్ల రూ.300 కోట్ల అదనపు భారం ప్రభుత్వంపై పడుతుందని వెల్లడించారు. ఫెర్రో అలాయిస్ పరిశ్రమలో కార్మికుల కోసం ప్రభుత్వం భారం భరిస్తుందన్నారు.అలాగే 62 నియోజకవర్గాల్లో 63 అన్న క్యాంటీన్ల ప్రారంభానికి కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. విజయవాడలో రూ.294 కోట్లతో అభివృద్ధి పనులకు ఆమోదం లభించిందని వెల్లడించారు. వైఎస్ఆర్, కర్నూలు జిల్లాల్లో 2 కారిడార్లకు భూమి బదిలీ కోసం స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు ఉంటుందన్నారు. అలాగే వైఎస్ఆర్ జిల్లాలో 2,590 ఎకరాలు ఏపీఐఐసీకి బదిలీకి ఆమోదం తెలిపిందన్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో 2600 ఎకరాలు ఏపీఐఐసీకి బదిలీకి ఆమోదం లభించిందన్నారు. అర్బన్ ల్యాండ్ సీలింగ్ భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తుల దాఖలు గడువు డిసెంబర్ 31 వరకు పొడిగింపు ఉంటుందని వెల్లడించారు. అలాగే పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లలో ఇళ్ల పట్టాల పంపిణీ ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి కొలుసు పార్థసారధి వెల్లడించారు.

# విశాఖ ఉక్కుకు రూ.11,440 కోట్లు

- కేంద్రం అధికారిక ప్రకటన



**టీ మీడియా, జనవరి 17, ఢిల్లీ :**ఎట్టకేలకు విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు మంచిరోజులొచ్చాయి. నష్టాల ఊబిలో ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకునేందుకు..11 వేల 440 కోట్లతో భారీ ప్యాకేజ్ ప్రకటించింది కేంద్ర ప్రభుత్వం. ఈ మేరకు అధికారిక ప్రకటన చేశారు..కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్. ఏపీతో పాటు దేశానికి ఎంతో కీలకమైన విశాఖ స్టీల్‌ప్లాంట్..ఈ ప్యాకేజ్‌తో మళ్లీ పుంజుకుంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు కేంద్రమంత్రి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో..ఈ ప్యాకేజీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు చెప్పారు.విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఊపిరి పోసేలా రివైవల్ ప్యాకేజీ కింద 11,500 కోట్లు కేటాయించిన ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు చెప్పారు..కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు. నష్టాలను అధిగమించి, ప్లాంట్ పూర్తి స్థాయి ఉత్పాదనతో లాభాల బాట పెట్టేందుకు ఈసాయం ఎంతగానో ఉపయోగపడుతుందన్న రామ్మోహన్‌నాయుడు..ఏపీ అభివృద్ధి, ప్రజల ఆకాంక్షల పట్ల ఎన్డీయే ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమని సోషల్ మీడియాలో పోస్ట్‌పెట్టారు.విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు భారీ ప్యాకేజీ ప్రకటించడం శుభపరిణామమన్నారు..టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు. కేంద్రం నిర్ణయంతో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగిపోయినట్టేనని స్పష్టం చేశారు. తమపోరాటానికి ఎట్టకేలకు ఫలితం దక్కిందన్న గంటా.. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించేలా కేంద్రంపై ఒత్తిడి తెస్తామని చెప్పారు.మరోవైపు ప్యాకేజీతో విశాఖ స్టీల్ ప్లాంట్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదంటున్నాయి.. కార్మిక సంఘాలు. సెయిల్‌లో స్టీల్‌ప్లాంట్ విలీనం ఒక్కటే శాశ్వత పరిష్కారమని కార్మిక సంఘాల నేతలు చెబుతున్నారు. స్టీల్‌ప్లాంట్‌కు నాలుగేళ్ల పాటు ట్యాక్స్ హాలీడే ఇవ్వడంతో పాటు సొంత గనులు కేటాయించాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కోరుతుంది. సెయిల్‌లో విలీనం ద్వారానే సంస్థను లాభాల్లోకి తీసుకువెళ్లొచ్చని కమిటీ కన్వీనర్ అయోధ్యరామ్ చెబుతున్నారు.ఏపీలో అధికారం చేపట్టిన రోజు నుంచి విశాఖ ఉక్కుపై ప్రత్యేక దృష్టి సారించింది..కూటమి ప్రభుత్వం. ఈ మేరకు సీఎం చంద్రబాబు ఢిల్లీ వెళ్లిన ప్రతిసారి ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామిలతో చర్చలు జరిపారు. ఇటీవల ప్రధానిని మరోసారి కలిసిన ముఖ్యమంత్రి..విశాఖ ఉక్కుకు అవసరమైన ఆర్థిక సాయం అందించాలని కోరారు. దీనిపై విభిన్న కోణాల్లో చర్చించిన అనంతరం కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఈ ప్యాకేజీకి ఆమోదం తెలిపింది.ఏటా 7.3 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యమున్న విశాఖ ఉక్కు కర్మాగారం..గత కొన్నేళ్లుగా నష్టాలను మూటగట్టుకుంటోంది. వర్కింగ్ క్యాపిటల్ కోసం చేసిన అప్పుల భారం, తగినంత ముడిసరకు లేకపోవడం, కోర్టు ఎటాచ్‌మెంట్లు, ఇన్‌సాల్వెన్సీ ప్రొసీడింగ్స్ అందుకు కారణమని స్టీల్‌ప్లాంట్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఈ సమస్యలను పరిష్కరించడంతో పాటు భవిష్యత్తులో తలెత్తే కష్టాల నుంచి తప్పించడానికి ఒక సమగ్ర ప్రణాళికను తయారు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం..ఇదివరకే పార్లమెంటు స్థాయీసంఘానికి చెప్పింది. దానిపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఆ సంఘం..పార్లమెంటుకు సమర్పించిన నివేదికలో సిఫార్సు చేసింది. దాని ప్రకారమే కేంద్ర ప్రభుత్వం ఈ ఆర్థిక ప్యాకేజీకి ఆమోదముద్ర వేసినట్లు తెలుస్తోంది.

## సింగపూర్‌లో పర్యటిస్తున్న
# సీఎం రేవంత్ రెడ్డి బృందం

- ఐటీఈతో ఒప్పందం చేసుకున్న స్కిల్ యూనివర్సిటీ
- 20 వరకు సింగపూర్‌లోనే ముఖ్యమంత్రి




**టీ మీడియా, జనవరి 17, హైదరాబాద్ బ్యూరో:** సింగపూర్ లో రాష్ట్ర బృందం మూడు రోజుల పర్యటన ఇవాళ ప్రారంభమైంది. గురువారం రాత్రి 10 గంటలకు దిల్లీ విమానాశ్రయం నుంచి సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఉన్నతాధికారుల బృందం ఈ ఉదయం సింగపూర్‌కు చేరుకుంది. సింగపూర్‌లోని ఛాంగీ విమానాశ్రయంలో సీఎం, మంత్రి, ఉన్నతాధికారులకు అక్కడి తెలుగు ప్రజలు స్వాగతం పలికారు. సింగపూర్ పర్యటన విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ ముఖ్యమంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం సింగపూర్ విదేశాంగ శాఖ మంత్రి వివియన్ బాలకృష్ణన్‌తో రాష్ట్ర ప్రతినిధి బృందం సమావేశమైంది. వివిధ రంగాల్లో సింగపూర్‌తో దీర్ఘకాలిక సంబంధాలపై వివియన్ బాలకృష్ణన్, రేవంత్ రెడ్డి చర్చించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, విద్యుత్, గ్రీన్ ఎనర్జీ, నీటి నిర్వహణ, మూసీ పునరుజ్జీవనం, విద్య, స్కిల్ డెవలప్‌మెంట్, ఐటీ తదితర రంగాలపై ఇద్దరు నేతలు చర్చించారు. ఛాంగీ నగరంలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ను సీఎం బృందం సందర్శించింది.ఐటీఈతో స్కిల్ యూనివర్సిటీ ఎంవోయూ : అక్కడ శిక్షణ ఇస్తున్న తీరు, కోర్సులు, సదుపాయాలను పరిశీలించారు. అనంతరం సింగపూర్ ఐటీఈతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఎంవోయూ కుదుర్చుకుంది. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు, ప్రత్యేక సీఎస్ జయేష్ రంజన్ సమక్షంలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వీసీ సుబ్బారావు, ఐటీఈ డిప్యూటీ డైరెక్టర్ ఫాబియన్ చియాంగ్ ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. సింగపూర్ ఐటీఈ పాఠ్యాంశాలను ఉపయోగించుకోవడంతో పాటు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ట్రైయినర్లకు శిక్షణ ఇచ్చేలా ఒప్పందం జరిగింది.సీఎం రేవంత్ ట్వీట్ : సింగపూర్ ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఐటీఈ పదో తరగతి విద్యార్థుల నుంచి అన్ని వయసుల వారికి జాబ్ రెడీ శిక్షణ ఇస్తోంది. స్కిల్స్ ఫర్ ఫూచర్, స్కిల్స్ ఫర్ లైఫ్ అనే నినాదంతో వంద కోర్సులకు ఆన్‌లైన్, క్యాంపస్ శిక్షణ ఇస్తున్న ఐటీఈలో ప్రస్తుతం 28 వేల మంది శిక్షణ పొందుతున్నారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి సహకరించాలని సింగపూర్ ఐటీఈని సీఎం కోరారు. ఈనెల 19 వరకు సింగపూర్‌లోనే రాష్ట్ర బృందం పర్యటించనుంది. ఈనెల 20 నుంచి దావోస్ లో ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సులో పాల్గొంటారు. రెండు దేశాల పర్యటన సింగపూర్ విదేశాంగ మంత్రితో ఫలవంతమైన చర్చలతో ప్రారంభమైందని సీఎం రేవంత్ రెడ్డి ఎక్స్‌లో ట్వీట్ చేశారు.

## సైఫ్ అలీ ఖాన్‌పై దాడిలో
# అండర్‌వరల్డ్ హస్తం ఉందా



### కేవలం చోరీ ప్రయత్నమా

**టీ మీడియా, జనవరి 17,ముంబై:** ప్రముఖ బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై జరిగిన దాడి వెనుక అండర్?వరల్డ్ హస్తం ఉందా? అనే అనుమానాలు వ్యక్తం అయిన నేపథ్యంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. అందులో భాగంగా సైఫ్ ఇంట్లో పనిచేసిన వారిని పోలీసులు ప్రశ్నిస్తున్నారు. మొత్తం 20 బృందాలు నిందితుడి కోసం విస్తృతంగా గాలిస్తున్నాయి. ముంబయిలో పలువురు ఇన్ఫార్మర్ల సాయంతో నిందితుడికి సంబంధించి సమాచారాన్ని రాబట్టేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. సైఫ్‌పై దాడి జరిగినపుడు సమీపంలో క్రియాశీలంగా ఉన్న అన్ని మొబైల్ ఫోన్ల సాంకేతిక డేటాను సేకరించారు.

### పనివాళ్ల ప్రమేయం ఉందా?

ఈ కేసుకు సంబంధించి పలువురిని పోలీసులు విచారిస్తున్నారు. సైఫ్ ఇంట్లో పనిచేస్తున్న వారిని పోలీసులు ఇవాళ బాంద్రా పోలీస్ స్టేషన్‌కు పిలిచి ప్రశ్నించారు. సైఫ్ ఇంట్లో పనిచేసిన కార్పెంటర్‌ను పోలీసులు ప్రశ్నించారు. ఆయన ఇంట్లో పనిచేసిన అందరినీ పోలీసులు విచారిస్తున్నారని, అందులో భాగంగానే తన భర్తను కూడా పిలిచారని కార్పెంటర్ భార్య చెప్పారు. తన తండ్రి బుధవారం సైఫ్ ఇంటికి పనికివెళ్లాడని ఘటన జరిగింది గురువారమని కార్పెంటర్ కుమారుడు వివరించాడు. మరోవైపు నిందితుడికి సంబంధించిన సీసీటీవీ కొత్త దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. అందులో నిందితుడు బ్యాగ్‌తో మెట్లు ఎక్కుతున్నాడు. గురువారం తెల్లవారుజాము అర్థరాత్రి ఒంటిగంట 37 నిమిషాలకు మెట్ల మార్గం ద్వారా నిందితుడి లోపలికి వెళుతున్నట్లు సీసీటీవీ దృశ్యాల్లో కనిపించింది. ఆ సమయంలో నిందితుడు ముఖానికి ఎరుపు రంగు వస్త్రాన్ని కట్టుకున్నాడు.

### తేరుకుంటున్న సైఫ్?

సైఫ్ అలీఖాన్ ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతోందని ఆయనకు చికిత్స చేస్తున్న ముంబయి లీలావతి ఆస్పత్రి వైద్యులు తెలిపారు. నిందితుడి దాడిలో సైఫ్ పెద్ద ప్రమాదం నుంచి తప్పించుకున్నారని వైద్యులు తెలిపారు. దాడిలో కత్తి సైఫ్ వెన్నుముకకు రెండు మిల్లీమీటర్ల దూరంలో ఆగిందని చెప్పారు. లేదంటే ఆయన వెన్నుముకకు తీవ్రగాయం అయ్యేదని వెల్లడించారు. ప్రస్తుతం సైఫ్ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిపారు. సైఫ్‌ను ఐసీయూ నుంచి సాధారణ వార్డుకు మార్చినట్టు తెలిపిన వైద్యులు సైఫ్ చేయి, మెడపై గాయాలకు ప్లాస్టిక్ సర్జరీ చేసినట్టు వివరించారు. సైఫ్ వెన్నులో చిక్కుకున్న కత్తిని తొలగించినట్టు తెలిపారు. సైఫ్ ప్రస్తుతం సాధారణ ఆహారం తీసుకుంటున్నాని తెలిపిన వైద్యులు ప్రస్తుతం అందరితో మాట్లాడుతున్నారని, నడుస్తున్నారని స్పష్టం చేశారు. మరో రెండు మూడు రోజుల్లో డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సైఫ్‌ను చూడడానికి అతని కుమార్తె సారా అలీఖాన్ ఆసుపత్రికి వెళ్లారు.

# 'కాంగ్రెస్ హైకమాండ్‌కు తెలిసే

- తెలంగాణలో దోపిడీ, మోసాలు

-మీడియాతో చిట్ చాట్ లో కేటీఆర్



**టీ మీడియా, జనవరి 17,రంగారెడ్డి** : తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న దోపిడీ, మోసాలు కాంగ్రెస్ అధిష్టానానికి తెలుసని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో బీజేపీ గెలుపు కోసం కాంగ్రెస్ ప్రయత్నం చేస్తోందని, బీజేపీ వ్యతిరేక ఓటు చీలాలన్నది కాంగ్రెస్ ఆలోచన అని ఆయన అన్నారు. రంగారెడ్డి జిల్లా షాబాద్?లో మీడియా ప్రతినిధులతో కేటీఆర్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రాష్ట్రంలో ఏడాదిగా మోసాల పరంపర కొనసాగుతోందని, హర్యానా, మహారాష్ట్రలోని ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ్మలేదని అన్నారు.క్రేజీవాల్ కోసం రాహుల్ సభ : ఎన్నికైన మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ మోసాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. గ్యారంటీలు కాదు, గారడీలను ప్రజలు తిరస్కరించారని కేటీఆర్ అన్నారు. దిల్లీలో కూడా కాంగ్రెస్?ను తిరస్కరిస్తారని తెలిపారు. లోక్?సభ ఎన్నికల సమయంలో అరవింద్ కేజ్రీవాల్ కోసం

మిగతా 3లో..

## కర్ణాటకలో మరో బ్యాంక్ దోపిడీ..
## -రూ.15 కోట్ల ఆభరణాలు, రూ.5 లక్షల నగదు చోరీ




**టీ మీడియా, జనవరి 17, మంగుళూరు :** కర్ణాటకలో మరో బ్యాంక్ దోపిడీ ఘటన చోటుచేసుకుంది. శుక్రవారం మధ్యాహ్నం ఉల్లాల్ సమీపంలోని కెసి రోడ్ బ్రాంచ్‌లో కోటేకర్ వ్యవసాయ సహకార బ్యాంక్‌పై పట్టపగలు ఆరుగురు సాయుధ దుండగులు దోపిడీకి పాల్పడ్డారు. బ్యాంక్ సిబ్బందిని తుపాకులతో బెదిరించి రూ.15 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, రూ.5లక్షల నగదును దోచుకువెళ్లినట్లు అధికారులు తెలిపారు. అనంతరం బూడిదరంగు ఫియట్ కారులో పరారయ్యారని అన్నారు. దుండగులు కత్తులు, తుపాకులతో బ్యాంకులోకి చొరబడ్డారని, సిబ్బందితో పాటు సిసిటివి టెక్నీషియన్‌ను బెదిరించారని అన్నారు. సిబ్బందిలో ముగ్గురు మహిళలు ఉన్నారని చెప్పారు. దోపిడీకి ముందు దుండుగుల భవనం గ్రౌండ్‌ఫ్లోర్‌లోని బేకరీలో విద్యార్థులను అక్కడి నుండి వెళ్లాల్సిందిగా బెదిరించారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. వారు తమలో తాము కన్నడలో మాట్లాడుకున్నారని, బ్యాంక్ సిబ్బందితో మాత్రం హిందీలో మాట్లాడారని అన్నారు. ఘటనా స్థలాన్ని కర్ణాటక అసెంబ్లీ స్పీకర్ యుటి ఖాదర్ సందర్శించారు. విచారణను వేగవంతం చేయాల్సిందిగా పోలీసులను ఆదేశించారు. కర్ణాటకలోని బీదర్‌లో గురువారం దోపిడీ దొంగలు భీభత్సం సృష్టించిన సంగతి తెలిసిందే. ఎటిఎంలో డబ్బులు పెట్టేందుకు వచ్చిన వాహనంపై దుండగులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో సెక్యూరిటీ గార్డు మరణించగా, ఇద్దరు సిబ్బందికి గాయాలయ్యాయి.

## కబడ్డీ కోర్టులో ఆ వ్యక్తి దహన సంస్కారాలు



**టీ మీడియా, జనవరి 17, సిద్దిపేట:** జిల్లా అక్కన్నపేట మండలం చౌటపల్లి అనే గ్రామంలో ఇటీవల మృతి చెందిన సంపత్ అనే కబడ్డీ క్రీడాకారుడి చితిని కబడ్డీ కోర్ట్ ఏర్పాటు చేసి అందులో దహన సంస్కారాలు చేశారు తోటి మిత్రులు, గ్రామస్థులు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కబడ్డీ ప్రేమికుడి అంత్యక్రియలను ఇలా వినూత్నరీతిలో నిర్వహించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ వద్ద సంక్రాంతి పండుగ రోజు రోడ్డు ప్రమాదం జరిగింది. ఆ రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై నుంచి కిందపడి కబడ్డీ సీనియర్ క్రీడాకారుడు పులికాశి సంపత్ మృతి చెందాడు. దీంతో మృతుడి స్వగ్రామమైన అక్కన్నపేట మండలం చౌటపల్లిలో కబడ్డి క్రీడాకారులు, స్నేహితులు, గ్రామస్తులు కబడ్డీ కోర్టు వేసి, దానిని పూలతో నింపి సంపత్ అంత్యక్రియలు నిర్వహించారు. సంపత్ తన యుక్త వయసు నుంచి కబడ్డీలో రాణించాలని ఉవ్విళ్లూరేవాడు. కానీ కుటుంబ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా, మధ్యలోనే దాన్ని వదిలివేసి లారీ డ్రైవర్‌గా మారిపోయాడు. ఆ తర్వాతి కాలంలో గ్రామంలో చాలా మంది యువకులను ప్రోత్సహించి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు పంపించాడు సంపత్. అలా కబడ్డీపై తన మక్కువను ప్రదర్శించి తృప్తి పొందాడు%ా% ఆయన ప్రోత్సాహంతోనే జాతీయస్థాయి కబడ్డీ క్రీడాకారుడిగా గంగాధరి మల్లేష్ రాణించి, ప్రస్తుతం ప్రో కబడ్డీలో వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నాడు. సంపత్ మరణ వార్త విని చాలా మంది కబడ్డీ క్రీడాకారులు గ్రామానికి వచ్చి ఆయన దహన సంస్కారాలు ఇలా కబడ్డీ కోర్ట్ వేసి అందులో జరిపించారు.



## సర్వే ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**టీ మీడియా ,జనవరి 17, ఆత్మకూరు:** ఆత్మకూరు మండలం మూలమల్ల గ్రామంలో రైతు భరోసా ఇందిరమ్మ ఇల్లు రేషన్ కార్డుల సర్వే ను జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి పరిశీలించారు. అంతవరం ఆత్మకూరు తహసిల్దార్ కార్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు,డేటా ప్రకారం సర్వే పకడ్బందీగా చేయాలని, అధికారులు ఎప్పటికీ అప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని, ప్రజా పాలల్లో ఇచ్చిన రేషన్ కార్డు దరఖాస్తులు పంచాయతీ కార్యదర్శులు ప్రజల వద్దకు వెళ్లి అర్హులైన వారిని గుర్తించే ప్రక్రియ వేగంగా చేయాలని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కి సంబంధించి మండలంలో జాబ్ కార్డు కలిగి ఉన్న వారి ఆధారంగా వారి పేరుపై భూమి ఉన్నదా లేదా వారి ఆర్థిక పరిస్థితిని పరిశీలించాలని సూచించారు. గ్రామాల్లో పట్టణాల్లో అద్దె ఉంటున్న ఇల్లు లేని నిరుపేదలను గుర్తించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి మల్లికార్జున, తాసిల్దార్ అబ్రహం ఆర్ఐ రాజేశ్వరి వ్యవసాయ అధికారులు, తాసిల్దార్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆత్మకూర్ లో డయాలసిస్ యూనిట్ ఏర్పాటు



**టీ మీడియా, జనవరి 17 ,ఆత్మకూరు :** మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి అభ్యర్థన మేరకు తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు దామోదర్ రాజ నర్సింహ మన ఆత్మకూర్ కు డైయలసిస్ యూనిట్ మంజూరు, త్వరలో టెక్నికల్ యూనిట్ స్థల పరిశీలన కొరకై ఆత్మకూరుకు వస్తున్నారని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తెలిపారు. ఈ సందర్భంగా ఆత్మకూర్ మరియు పరిసర ప్రాంత ప్రజలు మంత్రి కి ఎమ్మెల్యే కు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

## కొడుకు పనిని జీర్ణించుకోలేక పోయిన తండ్రి.

- కత్తితో నరికి హత్య




**టీ మీడియా, జనవరి 17,మెదక్ :** కడవరకు కంటికి రెప్పలా చూసుకోవాల్సిన, తల్లిదండ్రులను కొంతమంది పిల్లలు నిత్యం వేధిస్తూ వారికి మనోవేధనను మిగులుస్తున్నారు. మద్యానికి బానిసై తల్లిదండ్రులపై దాడులకు సైతం తెగపడుతున్నారు. ఇలా మద్యానికి బానిసై నిత్యం తల్లిదండ్రులకు నరకం చూపిస్తున్న కొడుకుపై, విసిగివేసారిన ఓ తండ్రి కఠినంగా వ్యవహరించాడు. కొడుకు వేధింపులను తట్టుకోలేక అతన్ని చంపేసి, నేరుగా పోలీసు స్టేషన్ కి వెళ్లి, విషయం చెప్పి లొంగిపోయాడు. ఈ ఘటన మెదక్ జిల్లాలో చోటుచేసుకుంది. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపల్లి గ్రామంలో దారుణం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మాదాసు శ్రీకాంత్(29) అనే యువకుడిని, తండ్రి మాదాసు దుర్గయ్య కత్తితో నరికి హత్య చేశారు. మాదాసు దుర్గయ్య కు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. కాగా టైలర్ పని చేసుకుని జీవనం సాగిస్తున్న దుర్గయ్య ఉన్న ఒక్క కూతురు వివాహం చేశారు. చిన్న కుమారుడైన శ్రీకాంత్ ఆటో డ్రైవర్ గా పని చేస్తున్నారు.అయితే గత పది సంవత్సరాలుగా శ్రీకాంత్ ఫుల్‌గా మద్యాని బానిస అయ్యాడు. ప్రతిరోజు మద్యం తాగి ఇంటికి రావడం.. తరుచు ఎదో ఒక రకంగా, ఇంట్లో ఉన్న తల్లిదండ్రులతో గొడవ పడడంతో పాటు, వారిపై దాడికి తెగబడ్డాడు. కన్న కొడుకు తనను చెప్పుతో కొట్టడాన్ని జీర్ణించుకోలేని దుర్గయ్య తీవ్ర మనోవేధనకు గురయ్యాడు. రాత్రి మద్యం సేవించి పడుకున్న కుమారుడు శ్రీకాంత్‌పై కత్తితో దాడి చేసి హత్య చేశాడు. అనంతరం నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి, జరిగిన విషయం చెప్పి లొంగిపోయాడు. ఈ ఘటన పై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## ఇంగ్లండ్‌ను క్లీన్ స్వీప్ చేసిన ఆసీస్



**టీ మీడియా, జనవరి 17, క్రీడలు :** మహిళల యాషెస్ సిరీస్-2025లో భాగంగా ఇంగ్లండ్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను ఆస్ట్రేలియా 3-0 తేడాతో క్లీన్ స్వీప్ చేసింది. శుక్రవారం జరిగిన మూడో వన్డేలో ఆసీస్ 86 పరుగుల తేడాతో ఘన విజయాన్ని అందుకుంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 308 పరుగులు చేసింది. మిడిలార్డర్ బ్యాటర్ ఆష్లే గార్డ్‌నర్ (102 బంతుల్లో 102 బీ 8 ఫోర్లు, సిక్స్) కెరీర్‌లో తొలి శతకంతో చెలరేగిపోగా, బెత్ మూనీ (64 బంతుల్లో 50 బీ 4 ఫోర్లు), తహిళ మెక్‌గ్రాత్ (45 బంతుల్లో 55 బీ 8 ఫోర్లు) అర్ధ సెంచరీలతో రాణించారు. ఆఖర్లో జార్జియా వేర్హమ్ (12 బంతుల్లో 38 నాటౌట్ బీ 5 ఫోర్లు, 2 సిక్సర్లు) మెరుపు ఇన్నింగ్స్‌తో ఆకట్టుకుంది. ఆసీస్ ఇన్నింగ్స్‌లో ఫోబ్ లిచ్‌ఫీల్డ్ 15, అలైసా హీలీ 15, ఎల్లిస్ పెర్రీ 2, అన్నాబెల్ సదర్‌ల్యాండ్ 10, అలానా కింగ్ 9, కిమ్ గార్త్ 1 (నాటౌట్) పరుగులు చేశారు. ఇంగ్లండ్ బౌలర్లలో లారెన్ బెల్, నాట్ సీవర్ బ్రంట్, చార్లీ డీన్ తలో రెండు వికెట్లు పడగొట్టగా.. లారెన్ ఫైలర్, సోఫీ ఎక్లెస్టోన్ చెరో వికెట్ దక్కించుకున్నారు.

## కళ్యాణ చెక్కులను అందజేసిన మంత్రి జూపల్లి

- గ్రామ సభల ద్వారానే లబ్ధిదారుల ఎంపిక



**టీ మీడియా, జనవరి 17,చిన్నంబావి:** చిన్నంబావి మండలం పెద్ద దగడ, గ్రామంలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, చెక్కులను రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక పురావస్తు మరియు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల పక్షాన ప్రజాస్వామ్యయుత పాలన ను అందిస్తుందని అన్నారు. అంతే కాకుండా ఈనెల 26వ తేదీ నుండి కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల, లాంటి పథకాలు కూడా అమలు చేయబోతున్నామని అన్నారు. ఈ ప్రభుత్వ పథకాలకు గ్రామ సభల ద్వారానే లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని అన్నారు. అదేవిధంగా ఇందిరమ్మ గృహాలకు అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటింటి సర్వే నిర్వహించి అందరికీ ఇందిరమ్మ గృహాలు అందే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ పథకాలలో ఎలాంటి అవకాశాలు జరగకుండా ఉండాలని అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి తో పాటు, తహసిల్దార్ ఎండి ఇక్బాల్, ఎంపీడీవో రమణా రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీలత రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, సింగిల్ విండో చైర్మన్ బగ్గారి నరసింహారెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ విద్యా సాగర్ రావు, మండల కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కొత్త కళ్యాణ్ రావు, మండల సీనియర్ నాయకులు చిదంబర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, బీచుపల్లి యాదవ్, పెద్ద దగడ మాజీ సర్పంచ్ సురేందర్ సింగ్, చిన్నంబావి మాజీ సర్పంచ్ రంజిత్ కుమార్, వెల్లగొండ మాజీ ఎంపిటిసి మహాదేవ గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గంగారి శీను, సోషల్ మీడియా కన్వీనర్ జగదీష్, యూత్ కాంగ్రెస్ నాయకులు కిరణ్ కుమార్ గౌడ్, పరశురాం, రాజేష్ నాయక్, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, తదితరులు, పాల్గొన్నారు.




## జర్నలిస్ట్ కు నివాళులు

**టీ మీడియా జనవరి 17:ఎండపల్లి :** పాత్రికేయులపై దాడి ప్రజాస్వామ్యం పైనె దాడి అని ఆయా ప్రజా సంఘాల నాయకులు నినాదలు చేశారు. మండల కేంద్రంలోని డీజేఫ్ ప్రెస్ క్లబ్ లొ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయా ప్రజా సంఘాల నాయకులు ఇటీవల చత్తిష్ ఘడ్ రాష్టం బీజాపూర్ బస్తర్ జంక్షన్ జిల్లాకు చెందిన జర్నలిస్ట్ ముఖేష్ చంద్రకర్ హత్యను ఖండిస్తూ నివాళ్ళు అర్పించారు. నిజాయితీ ని నిర్భయంగా వ్రాసే పాత్రికేయులపై కక్ష సాదింపు దోరణి అవలంబిస్తున్నారని,జర్నలిస్ట్ లను భయభ్రాంతులకు గురి చేస్తూ దూర్భాషాలాడుతూ హత్యలు చేస్తున్న వ్యక్తులపై రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని. జర్నలిస్ట్ ల భద్రతకు ప్రభుత్వాలు ప్రత్యేకమైన చట్టాలు తీసుకురావాలని వారికి రక్షణ కల్పించాలని వారిని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరి పైన వుందని హత్య చేయబడ్డ జర్నలిస్ట్ కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలనిపాత్రికేయులకు మద్దతుగా కలసి పోరాటాలు నిర్వహిస్తామని నిజాలు నిర్భయంగా బాహ్య ప్రపంచానికి తెలియజేయడంలో జర్నలిస్ట్ లదే కీలకమైన పాత్ర అని విలేకరులపై దాడిని ప్రజా సంఘాలు ఎప్పటికీ సహించబోమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, తెలంగాణ రైతు సమస్య సాధన సమితి నాయకులు ఎరుకల రాజన్న,టీ పి జాక్ రాష్ట్ర కమిటీ మెంబర్ పొన్నం రాజ మల్లయ్య ,రైతు సమితి పెద్దపెల్లి జిల్లా కమిటీ మెంబర్ గొట్టే లింగయ్య, బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ ధర్మారం మండల అధ్యక్షుడు ముదాం శ్రావణ్ కుమార్,డీజే ఎఫ్ యూనియన్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గౌరీ ప్రభాకర్ ప్రధాన కార్యదర్శి బండి శ్రీధర్, ఉపాధ్యక్షులు తోడేటి మల్లేశం గౌడ్,డీజేఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తుమ్మ శ్రీనివాస్ ప్రచార కార్యదర్శి పరకాల మనోజ్ కార్యవర్గ సభ్యులు వైద్య సతీష్ కుమ్మరి సురేష్, కంటే ప్రశాంత్,తదితరులు పాల్గొన్నారు.

## ఆ దారులు నేరుగా నరకానికే

### - యాక్సిడెంట్‌లకు కేరాఫ్ అడ్రస్
### -ప్రయాణం అంటేనే వణికిపోతున్నారు



**టీ మీడియా, జనవరి 17, శివ్వంపేట :** ఆ రోడ్డుపై ప్రయాణం అంటేనే వణికిపోతున్నారు ప్రయాణీకులు. ఒకవేళ రోడ్డుపైకి వచ్చినా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి. ఈ రోడ్డుపై జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని చేపట్టిన, కొత్త రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగడంతో ప్రయాణికులు కష్టాలు అన్ని ఇన్ని కావు. ఈ రోడ్డు మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలోనిది. ఏదులాపూర్ చౌరస్తా నుంచి వెల్దుర్తి వరకు వెళ్లేవారికి ఈ రోడ్డే కీలకం. కానీ ఇప్పుడు ఈ రోడ్డు యాక్సిడెంట్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. చాలా రోజులుగా ఈ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతూనే ఉన్నా.. పూర్తి మాత్రం కావడం లేదు. గతంలో వెల్దుర్తి నుంచి బాలనగర్ వరకుబస్సు నడిచేది అని, ఈ రహదారి పూర్తిగా దెబ్బతినడంతో బస్సు రద్దు కావడం వల్ల ఆయా గ్రామాల నుంచి కూరగాయలు, పాలు.. నర్సాపూర్, తూప్రాన్, హైదరాబాద్ తీసుకెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే ఈ ఎనిమిది కిలోమీటర్ల రహదారి నిర్మాణంతో పాటు, చండి నుంచి అనంతారం వరకు 10 కిలోమీటర్ల రహదారి కలిపి మొత్తం 18 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికై సంవత్సరం క్రితమే 38 కోట్లు ప్రభుత్వం సాంక్షన్ చేసింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ ఏదులాపూర్ నుంచి పోతులగుడా వరకు రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాడు. కానీ 8 నెలలు గడుస్తున్నా రహదారి నిర్మాణం పనులు నత్తనడకగా సాగడంతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డు నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలోనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఎక్కడా సూచిక బోర్డులు లేకపోవడం, రోడ్డుపై ముందు వాహనాలు వెళ్తుంటే వెనుక పెద్ద ఎత్తున దుమ్ములేవడంతో, వెనుక వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడమే కాదు.. ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. వీటికి తోడు ఎదులపూర్ చౌరస్తా వద్ద రోడ్డు పక్కనే కల్లు డిపో ఉంది. ఇక్కడికి రాగానే అక్కడ కల్లు తాగి వాహనాలు నడపడం వల్ల కూడా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అందుకే ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటేనే వణికిపోతున్నారు ప్రయాణికులు. ఇక గడిచిన ఆరు నెలల్లో ఈ రోడ్డుపై ఎన్నో ప్రమాదాలు జరిగాయి. ముఖ్యంగా కొన్ని రోజుల క్రితమే ఈ రోడ్డు పక్కన ఉన్న చెరువులో కారు బోల్తా పడి అందులో ఉన్న, ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు చనిపోయారు. ఇది చాలా ఘోరమైన ప్రమాదం. ఇక ఇదే రోడ్డుపై పాంబండ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై నుంచి పడి మృతి చెందారు. అలాగే వెల్దుర్తికి చెందిన ఓ డాక్టర్ కుటుంబం ప్రయాణిస్తున్న కారు సైతం అదుపుతప్పి వరిపొలాల్లోకి దూసుకెళ్లడంతో ప్రాణాలతో బయటపడ్డారు. ప్రమాదాలు జరిగిన సమయంలో కనీసం అక్కడ సూచిక బోర్డు కూడా లేదని, ప్రమాదం జరిగిన అనంతరం తూతుమంత్రంగా అక్కడా, ఇక్కడా చిన్నగా సూచిక బోర్డు ఏర్పాటు చేశారు అధికారులు. ఈ రోడ్డుపై వరుస ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు అసలు పట్టించుకోవడం లేదంటున్నారు స్థానికులు. రోడ్డు నిర్మాణం పనులు వేగంగా జరగడంలేదని ప్రాణం అరిచేతిలో పెట్టుకుని, బిక్కుబిక్కుమంటూ ప్రయాణం చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఆయా గ్రామాల ప్రజలు.

## ఆదర్శంగా నిలుస్తున్న లక్ష్మీనగర్'

### అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న ఊరు
### -: మండల కేంద్రంగా సోలిపూర్ అభివృద్ధి
### - ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**టీ మీడియా, జనవరి 17, వనపర్తి బ్యూరో :** ఖిల్లా ఘణపురం మండలంలో మేజర్ గ్రామపంచాయతీ అయిన సోళీపురం గ్రామాన్ని మండల కేంద్రంగా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసుకుందామని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సోలిపురంలో ఉన్నత పాఠశాల కాంపౌండ్ వాల్ నిర్మాణానికి, తెలుగువాడలో ఐదు లక్షల వ్యయంతో సిసి రోడ్ నిర్మాణానికి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డ శంకుస్థాపనలు చేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టి సారించిందన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సైతం విద్యా వ్యవస్థను పటిష్టపరిచేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక చర్యలు చేపడు తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వనపర్తి నియోజకవర్గం లోను విద్యా వ్యవస్థను పూర్తిస్థాయిలో బలుపేతం చేసేందుకు నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, వనపర్తి శాసనసభ్యులుగా నేను తమకు కేటాయించిన నిధులను కేవలం విద్యా వ్యవస్థను పటిష్ట పరిచేందుకే కేటాయించేందుకు నిర్ణయం తీసుకున్నామని ఎమ్మెల్యే చెప్పారు. క్రీడల బలోపేతానికి రాష్ట్రవ్యాప్తంగా నాలుగు క్రీడ పాఠశాలను ప్రారంభిస్తున్నారని అందులో ఒకటి వనపర్తి నియోజకవర్గంలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. వనపర్తి నియోజకవర్గంలో సోలిపురం తో పాటు పెద్దమందడి మండలంలోని వెల్టూర్ జంగమయ్యపల్లి బలిజపల్లి గ్రామాలను మండల కేంద్రాలుగా చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. సోలిపురం లో సింగిల్ విండో, ఏర్పాటుతోపాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేసుకుందామని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సభ్యులు సోలిపురం రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటయ్య, వెంకట్రావు, నాయకులు సాయిచరణ్ రెడ్డి, మాజీ సర్పంచ్ సతీష్,ప్రకాష్, మండల నాయకులు కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**కృష్ణా జలాలకు పూజ**

ఖిల్లా ఘణపురం మండలం మల్కాపురం గ్రామానికి చేరుకున్న కృష్ణమ్మ జలాలకు శుక్రవారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి సభ్యులు సోలిపురం రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటయ్య, వెంకట్రావు, నాయకులు సాయిచరణ్ రెడ్డి, మాజీ సర్పంచ్ సతీష్,ప్రకాష్, కొండారెడ్డి, మండల నాయకులు కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఖిల్లా గణపురం మండలం షాపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ నిధులు 10 లక్షల రూపాయలతో అండర్ డ్రైనేజ్ నిర్మాణం పనులను గురువారం వనపర్తి శాసనసభ్యులు గౌరవ శ్రీ తూడి మేఘారెడ్డి ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి సభ్యులు సోలిపురం రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటయ్య, మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేగా నేను కాంగ్రెస్ ఎంపీగా మల్లు రవి కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని గ్రామస్థాయిలోనూ కాంగ్రెస్ బలపరిచిన

## ఎల్ఓసి నీ అందజేసిన ఎమ్మెల్యే



**టీ మీడియా, జనవరి 17, వనపర్తి బ్యూరో :** వనపర్తి మండలం కడుకుంట్ల గ్రామం నివాసి అయినా కుమ్మరి అబ్దుల్లా తండ్రి వెంకటయ్య గుండెపోటుతో నిమ్స్ హాస్పిటల్ హైదరాబాదులో చేరడం జరిగినది ఇట్టి విషయాన్ని కుటుంబ సభ్యులు మండల అధ్యక్షులు రవి కిరణ్ ద్వారా ఎమ్మెల్యే మెగా రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా శాస్త్ర చికిత్స నిమిత్తం బాధితుడికి 225000/-రూపాయలు ఎల్ఓసి ద్వారా కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే తూడిమేగా రెడ్డి అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రవి కిరణ్, కౌన్సిలర్ నక్క రాములు , కుటుంబ సభ్యులు అనిల్ పాల్గొనడం జరిగింది. ఎల్ఓసిని అందుకున్న కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలియజేసుకున్నారు.

## అవినీతి పరులకు ఘనంగా వీడ్కోలు పలుకుదాం
## స్వీపింగ్ మిషన్ కు నివాళులు అర్పించిన ఐక్యవేదిక



**టీ మీడియా, జనవరి 17, వనపర్తి బ్యూరో :** అవినీతి పరులకు ఘనంగా వీడ్కోలు పలుకుదాం మంచి వారిని గుండెల్లో పెట్టుకుందాం. బల్దియా పాలకులపై ప్రజలకు అఖిలపక్ష ఐక్యవేదిక పిలుపు. శుక్రవారం మున్సిపాలిటీ గత నాలుగు సంవత్సరాల క్రితం 67 లక్షలు పైగా ఖర్చు చేసి తెచ్చిన సెకండ్ హ్యాండ్ స్వీపింగ్ మిషన్ ఒక్కరోజు కూడా పనిచేయకుండా మూలకు పెట్టడంతో దానికి పూజ చేసి నివాళులు అర్పించిన ఐక్యవేదిక నాయకులు. నాలుగు సంవత్సరాల క్రితం ప్రజల సొమ్ముతో పనికిరాని స్వీపింగ్ మిషను తెచ్చి (ఘాట్లో) మూలకు పెట్టేశారు. అంతేకాకుండా పాత జె.సి.బి ని, ట్రాక్టర్లను, ఇతర పాత సామాన్లు ఎలాంటి టెండర్ లేకుండా రాత్రికి రాత్రి అమ్ముకున్నారు. అది మొత్తం కలిపితే కోట్లల్లో అవుతుంది. అవన్నీ ప్రజల డబ్బు. ఇంత అవినీతి జరుగుతున్నా , చూచి చూడ నట్లుంటున్న అధికారులు వారికి ఎంత శాతం మదుతుందో తెలియాలి. లేకుంటే చర్యలు తీసుకోవాలి. వీటిపై విచారణ జరిపించాలని ఐక్యవేదిక కోరుతున్నా పట్టించుకోకుండా దున్నపోతుపై రాళ్ల వర్షం పడితే చెలించనట్లు ఉంటున్న అధినాయకులు, అధికారులు, ప్రజలకు మాత్రం చెత్తకు టాక్స్, నీటికి టాక్స్, ఇంటికి టాక్స్ ,అంటూ కడుతూ పోతున్నారు. పాలకులు ప్రజల కష్టాలను మాత్రం విస్మరిస్తున్నారు. ఐదు సంవత్సరాలలో ఎవరు మంచివారు, ఎవరు అవినీతిపరులో తేల్చి చెప్పడానికి ఐక్యవేదిక సిద్ధమై ప్రజల ముందుకు వస్తున్నది. త్వరలో కొందరి అవినీతి,అన్ని వార్డుల వారీగా సమస్యలు, అభివృద్ధి ప్రజల ముందు ఉంచుతాము. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్ తోపాటు టిడిపి రాష్ట్ర నాయకులు కొత్త గొల్ల శంకర్, కాంగ్రెస్ నాయకులు వెంకటేష్, బీఎస్పీ టౌన్ అధ్యక్షులు గంధం భరత్, నాయకులు బొడ్డుపల్లి శంకర్, బీసీ నాయకులు గొనికాడి యాదయ్య, లోక్సత్తా నాయకులు రాజ్ కుమార్, బిజెపి నాయకులు రవి, శివకుమార్, రమేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబానికి ఆర్థిక సహాయం

### ఎర్వ సాయి ప్రసాద్ యాదవ్

**టీ మీడియా, జనవరి 17, వనపర్తి బ్యూరో :** వనపర్తి మండలం కశింనగర్ ఎర్రగటు తాండాకి చెందిన మూడవత్ రాములు అనగా గురువారం రోజున ఆర్థిక సమస్యల వలన మృతి చెందాడు. ఇట్టి విషయాన్ని గ్రామ యువకులు నీలేష్, రాజు, నాగేష్, రాము, హన్మంతు,గోపి,రమేష్,మోహన్, తదుపరి యువకులు ఇట్టి విషయాన్ని వనపర్తి జిల్లా యువ నాయకులు ఎర్వ సాయి ప్రసాద్ యాదవ్ కి తెలియపరచక వెంటనే స్పందించిన సాయి యాదవ్ మృతుడి కుటుంబానికి 5,000/- రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు, వారి కుటుంబానికి ఎల్లవేలల అండగా ఉంటాను అన్నారు. అదే విధంగా కడుకుంట్ల గ్రామానికి చెందిన కడారి శకుంతల అనే మహిళ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ గురువారం మరణించడం జరిగింది. ఇట్టి విషయాన్ని గ్రామ నవభారత్ యూత్ యువకులు సాయి ప్రసాద్ యాదవ్ కి తెలియ చేయగా వెంటనే స్పందించి 5000/- రూపాయల ఆర్థిక సహాయం అందించడం జరిగింది.

## అవార్డు గ్రహీతలను సన్మానించిన రెస్క్యూ జిఎం




**టీ మీడియా,జనవరి 17,గోదావరిఖని :** రామగుండం ఏరియాలోని ప్రధాన రెస్క్ స్టేషన్లో శుక్రవారం రోజు జరిగిన కార్యక్రమంలో సింగరేణి రెస్క్యూ సర్వీసులో 25 సంవత్సరాలు పూర్తి చేసుకుని ఝూరండ్ రాష్ట్రంలోని ధన్బాద్లో రెస్క్యూ సిల్వర్ జూబ్లీ అవార్డు తీసుకున్న చల్లా రవీందర్ రెడ్డి,బత్తుల రమేష్,మడికంటి శ్రీనివాస్,మహమ్మద్ ఖాసిం,కటుకూరి రవీందర్ రెడ్డి,లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. రెస్క్యూ జనరల్ మేనేజర్ కారెం శ్రీనివాస్ రెడ్డి, రెస్క్యూ సూపరింటెండెంట్ బింగి మాధవరావు, ఇన్స్పెక్టర్ భాస్కర్ రెడ్డి, నరసింహమూర్తి,రెస్క్యూ స్టేషన్ సిబ్బంది జక్కుల కిషన్ రావు,వి.కళాధర్, మురళీకృష్ణ,అఖీపుద్దీన్, సంజీవ్,శ్రావణ్,ఎస్.కె నవాబ్,యాక్టివ్ రెస్క్యూ ట్రైన్ పర్సన్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెస్క్యూ జనరల్ మేనేజర్ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ...రెస్క్యూలో 25 సంవత్సరాలు ఎన్నో కష్టాలకు ఓర్చుకొని పూర్తి చేయడం చాలా సింగరేణికే గర్వకారణం అని ఇకముందు కూడా ఇంత ఆరోగ్యంగా సేవలందించాలని సింగరేణి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఈ అవార్డును ధన్బాద్లో కుటుంబ సభ్యులతో కలిసి తీసుకోవడం కూడా ఎంతో సంతోషమని వీరిని ఉద్దేశించి మాట్లాడుతు అభినందనలు తెలిపారు.

# 'కాంగ్రెస్ హైకమాండ్‌కు తెలిసే

## - తెలంగాణలో దోపిడీ, మోసాలు

## -మీడియాతో చిట్ చాట్ లో కేటీఆర్



**టీ మీడియా, జనవరి 17,రంగారెడ్డి :** తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న దోపిడీ, మోసాలు కాంగ్రెస్ అధిష్టానానికి తెలుసని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో బీజేపీ గెలుపు కోసం కాంగ్రెస్ ప్రయత్నం చేస్తోందని, బీజేపీ వ్యతిరేక ఓటు చీలాలన్నది కాంగ్రెస్ ఆలోచన అని ఆయన అన్నారు. రంగారెడ్డి జిల్లా షాబాద్?లో మీడియా ప్రతినిధులతో కేటీఆర్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రాష్ట్రంలో ఏడాదిగా మోసాల పరంపర కొనసాగుతోందని, హర్యానా, మహారాష్ట్రలోని ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ్మలేదని అన్నారు.క్రీవాల్ కోసం రాహుల్ సభ : ఎన్నికైన మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ మోసాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. గ్యారంటీలు కాదు, గారడీలను ప్రజలు తిరస్కరించారని కేటీఆర్ అన్నారు. ఢిల్లీలో కూడా కాంగ్రెస్?ను తిరస్కరిస్తారని తెలిపారు. లోక్?సభ ఎన్నికల సమయంలో అరవింద్ కేజ్రీవాల్ కోసం రాహుల్ గాంధీ సభ కూడా పెట్టారని, ఇప్పుడు కేజ్రీవాల్ స్కాములు అని రేవంత్ రెడ్డి అంటున్నారని ఆక్షేపించారు. సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీని తెలంగాణ ప్రజలు నమ్మి ఓట్లు వేశారని కేటీఆర్ మండిపడ్డారు.బీసీ డిక్లరేషన్?పై మల్లగుల్లాలు : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా స్థానిక సంస్థల ఎన్నికలు ఎలా నిర్వహిస్తారన్న కేటీఆర్, బీసీ డిక్లరేషన్, స్కాముల గురించి బీజేపీ ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. స్వయంగా ప్రధాని ఆర్?ఆర్ ట్యాక్స్ అని చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. జగిత్యాలలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పరిస్థితి ఏంటో తెలుసుకోవాలని, సొంత కాంగ్రెస్ కార్యకర్తను హత్య చేస్తే దిక్కులేదని కేటీఆర్ విమర్శలు గుప్పించారు. తెలంగాణ ప్రజలు ముమ్మాటికీ నిలదీయాల్సింది ఢిల్లీలోని కాంగ్రెస్ అధిష్టానాన్నేనని ధ్వజమెత్తారు. హిమాచల్?ప్రదేశ్ తరహాలో దేశం అంతటా గంజాయి సాగు తీసుకొస్తారేమోనని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఎన్నికల కోసమే రైతు భరోసా నాటకం అన్న ఆయన కేసీఆర్ చెప్పినట్లు ఎన్నికలు అయిపోగానే రైతులకు సాయం నిలిపివేస్తారని తెలిపారు. బీఆర్ఎస్?కు ఆయువుపట్టు రైతులేనని, వారి తరఫున నిరంతరం ప్రశ్నిస్తూనే ఉంటామని అన్నారు.సభాపతి నిర్ణయం తీసుకోవాలి : సీఎం రేవంత్ రెడ్డి 2024 దావోస్ పర్యటనతో 40 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. అందులో 40 పైసలు కూడా రాలేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఏడాదిలో రేవంత్ రెడ్డి తెచ్చిన ఒక్క పరిశ్రమనైనా చూపాలని అన్నారు. ఫార్ములా-ఈ రేసు కేసులో అవినీతి లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారని గుర్తు చేశారు. ఫిరాయింపులపై సుప్రీంకోర్టు తీర్పు స్పష్టంగా ఉందన్న కేటీఆర్, మూడు నెలల్లో సభాపతి నిర్ణయం తీసుకోవాలని గతంలోనే మణిపూర్ కేసులో సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారు. హైకోర్టు తీర్పును కూడా సభాపతి బేఖాతరు చేయడం లేదన్న ఆయన, ఈ ఏడాది ఉప ఎన్నికలు కచ్చితంగా వస్తాయనభావిస్తున్నట్లు తెలిపారు. ఫిరాయింపుదారులను మళ్లీ వెనక్కు తీసుకునే ఉద్దేశం ఉంటే సుప్రీంకోర్టులో పిటిషన్ ఎందుకు వేస్తామని కేటీఆర్ అన్నారు. పది నియోజకవర్గాల్లో తమకు చాలా మంచి అభ్యర్థులు ఉన్నారని తెలిపారు. బీజేపీ నేతలు తనపై చూపే ఉత్సాహాన్ని కాంగ్రెస్ ప్రభుత్వంపై చూపాలని, అమృత్ అవినీతిపై కేంద్రానికి వెళ్లి ఫిర్యాదు చేసినా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని కేటీఆర్ అసహనం వ్యక్తం చేశారు.అబద్దాల ప్రచారానికే రూ.550 కోట్లు! : ఆర్?ఎస్?ఎస్?తో సంబంధాలు ఎవరికి ఉన్నాయో, లోపల ఖాకీ నిక్కర్ అని అసదుద్దీన్ ఓవైసీ ఎవరిని అన్నారో అందరికీ తెలుసని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఏడాదిలో అబద్దాల ప్రచారానికి రేవంత్ రెడ్డి రూ. 550 కోట్లు ఖర్చు చేశారని ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డి ఏకపక్షంగా రద్దు చేయడం వల్ల రూ. 46 కోట్లతో పాటు రాష్ట్ర ప్రతిష్ఠ దెబ్బతిందని ఆయన ఆరోపించారు. 46 కోట్లు వసూలు చేసేందుకు ఏడాదిగా సీఎం ఏం చేశారని ప్రశ్నించారు.

## సర్వే ఆధారంగానే కొత్త రేషన్ కార్డులు
### - స్పష్టం చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్
### - తప్పుడు సమాచారం నమ్మొద్దని సూచన



**టీ మీడియా, జనవరి 17, కరీంనగర్ బ్యూరో :** రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు జారీ చేస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కుల సర్వే సమాచారం ఆధారంగా కొత్త రేషన్ కార్డులు వస్తాయని, ఇందులో ఎలాంటి అపోహలు వద్దని రాష్ట్ర ప్రజానీకానికి సూచించారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఇందుర్తిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, జనవరి 26 నుంచి కొత్త రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియ కోసం గ్రామాల్లో సర్వే జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 2 కోట్ల 90 లక్ష రేషన్? కార్డులున్నాయని తెలిపారు.గత 10 సంవత్సరాలుగా రేషన్ కార్డులు లేకుండా, కొత్తగా పెళ్లైన వారికి, కొత్త కుటుంబాలు, మార్పులు చేర్పులు, అర్హత ఉండి కొత్త రేషన్ కార్డులు రాని వారికి జనవరి 26 నుంచి రేషన్? కార్డులు ఇస్తామని వెల్లడించారు. ప్రతిపక్షాలు కావాలని రాజకీయం చేసి రాద్ధాంతం చేస్తున్నాయని, రేషన్? కార్డు అర్హత ఉండి, రాకుంటే సంబంధిత అధికారికి, ప్రజా ప్రతినిధులకు వినతి పత్రం ఇవ్వాలని తెలిపారు. పాత రేషన్ కార్డులు తొలగించడం లేదని, ఇందులో ఎలాంటి సందేహం లేదన్నారు. ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తే నమ్మొద్దని, ఏవైనా సందేహాలు ఉంటే స్థానిక అధికారులను అడిగి తెలుసుకోవాలని తెలిపారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో కొత్త మండలాలు ఏర్పడినప్పుడు ఇందుర్తి మండలం ఏర్పడుతుందన్నారు.

## నష్టపరిహారంనికి లంచం అడుగుతున్నరు

**టీ మీడియా, జనవరి 17, నర్వ :**నారాయణపేట జిల్లా నర్వ మండలం లంకాల గ్రామానికి చెందిన రైతులు అయ్యపోల్ల వెంకటేశ్వర్ రెడ్డి, చిన్న కిష్టయ్య, వీరన్న గౌడ్, నల్ల హనుమంతుకు చెందిన 1 ఎకరం 36 గుంటలు సంగం బండ కాలువ భూసేకరణలో పోయింది.ఇందుకుగాను నష్టపరిహారం కింద సుమారు రూ.28 లక్షలకు సంబంధించి డాక్యుమెంటేషన్ అంతా పూర్తై చెక్ రెడీ అయ్యే దశలో ఉంది. కలెక్టరేట్లో భూసేకరణ కార్యాలయంలో పని చేసే ఉద్యోగి వచ్చిన దాంట్లో తనకు రూ.8 లక్షలు ఇస్తే గాని చెక్ ఇవ్వనంటూ వేధింపులకు గురిచేస్తున్నాడని, తమకు న్యాయం చేయాలని రైతులు వేడుకుంటున్నారు. పై విషయం నర్వ మండల సోషల్ మీడియాలో గ్రూపులలో హల్చల్ చేస్తుంది

## : మీలాంటి క్లినిక్‌లు మోసం చేస్తున్నాయి :
### -కలర్స్ పై వినియోగదారుల కమిషన్ సీరియస్

**టీ మీడియా, జనవరి 17, హైదరాబాద్ బ్యూరో :** ఊబకాయం, శరీరంలో ఉన్న అధిక కొవ్వు తగ్గిస్తామంటూ పలు క్లినిక్‌లు అమాయకులను మోసం చేస్తున్నాయని, ఈ తరహా చికిత్స అందించే క్లినిక్‌లు నిబంధనల మేరకు నడుస్తున్నాయో లేదో నివేదిక అందించాలని హైదరాబాద్ డీఎంహెచ్‌వో, వైద్య విధాన పరిషత్ డైరెక్టర్‌ను రాష్ట్ర వినియోగదారుల కమిషన్ ఆదేశించింది. మార్చి 17వ తేదీలోపు నివేదిక అందించాలంది.




అసలేం జరిగిందంటే? సంగారెడ్డికి చెందిన యువతి మియాపూర్‌లోని కలర్స్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్‌లో బరువు తగ్గడానికి చికిత్స తీసుకుంది. రూ.1.05 లక్షలు చెల్లించిన యువతికి చికిత్స తీరు నచ్చకపోవడంతో డబ్బులు తిరిగి ఇవ్వాలని కలర్స్ హెల్త్ కేర్ ప్రతినిధులను కోరింది. దీనికి ప్రతినిధులు నిరాకరించడంతో సంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించింది. విచారణను చేపట్టిన జిల్లా వినియోగదారుల కమిషన్ యువతికి 9 శాతం వడ్డీతో డబ్బులు తిరిగి చెల్లించాలని, మానసికంగా ఇబ్బంది కలిగించినందుకు రూ.50 వేలు జరిమానా విధించింది. డబ్బులు సకాలంలో చెల్లించకపోతే అదనంగా మరో 3 శాతం వడ్డీ చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేసింది.రాష్ట్ర వినియోగదారుల కమిషన్‌కు అప్పీలు : అయితే జిల్లా వినియోగదారుల కమిషన్ ఆదేశాలను సవాల్ చేస్తూ కలర్స్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు రాష్ట్ర వినియోగదారుల కమిషన్‌లో అప్పీలు దాఖలు చేశారు. చికిత్స తీసుకున్న యువతి తగిన సూచనలు పాటించలేదని, ఆహార నియమాలు పాటించకపోవడం వల్లే బరువు తగ్గలేదని కమిషన్‌కు అందించిన వివరాల్లో పేర్కొన్నారు. దీనికి బాధిత యువతి సమాధానం ఇస్తూ అర్హత లేని వాళ్లతో కలర్స్ హెల్త్‌కేర్ వాళ్లు చికిత్స చేయిస్తున్నారని కమిషన్‌కు తెలిపింది.అప్పీలు కొట్టివేత ఇరువైపులా వాదనలు విన్న రాష్ట్ర వినియోగదారుల కమిషన్ కలర్స్ హెల్త్‌కేర్ సమర్పించిన అనుమతి పత్రాలు కేంద్ర ఆరోగ్య శాఖ నిబంధనల ప్రకారం చెల్లవని తేల్చి చెప్పింది. నిపుణులైన వైద్యులు, సరైన అనుమతి పత్రాలు లేకుండా ఊబకాయం లాంటి కఠినమైన చికిత్సలను ఎలా అందిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు కలర్స్ హెల్త్ కేర్ దాఖలు చేసిన అప్పీలును రాష్ట్ర వినియోగదారుల కమిషన్ కొట్టేసింది.

## విచారణలు వేగవంతం చేయండి
### - అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ ఆదేశం



**టీ మీడియా, జనవరి 17, అమరావతి బ్యూరో :** పంచాయితీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, అటవీ శాఖల్లో విజిలెన్స్, ఏసీబీ, శాఖాపరమైన విచారణలు వేగవంతం చేయాలనీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఏళ్ల తరబడి కేసులు పెండింగ్?లో ఉంచడం ఏమిటనీ డిప్యూటీ సీఎం ప్రశ్నించారు. ఎన్ని కేసులు పెండింగ్?లో ఉన్నాయి, వాటి వివరాలు ఏమిటో నివేదిక సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆయా శాఖల ముఖ్య కార్యదర్శులకు పవన్ ఆదేశించారు.ఉద్యోగుల పనితీరు మీద సున్నితమైన విజిలెన్స్ ఉండాలని సూచించారు. ఉద్యోగుల నిజాయతీ, పనితీరు, నిబద్ధతకు అది ఓ సూక్ష్మదర్శనిలా పని చేస్తుందని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఉద్యోగులపై నమోదు అవుతున్న విజిలెన్స్ కేసులు, శాఖాపరమైన విచారణలు, దర్యాప్తులు, చర్యలు ఏళ్ల పాటు పెండింగ్?లో ఉండిపోవడం ఉద్యోగుల పని తీరుపై ప్రభావం చూపిస్తుందన్నారు.క్రమశిక్షణ చర్యలు, శాఖాపరమైన విచారణలకు సంబంధించిన కేసులు ఏళ్ల తరబడి పెండింగ్?లో ఉన్న అంశంపై డిప్యూటీ సీఎం ఆరా తీశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్?డబ్ల్యూఎస్, అటవీ, పర్యావరణ శాఖల్లో ఉన్న విజిలెన్స్, ఏసీబీ, శాఖాపరమైన కేసుల వివరాలు, అవి ఎంత కాలంగా పెండింగ్?లో ఉన్నాయి, దానికి కారణాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. కొన్ని కేసులు 20 ఏళ్ల నుంచి పెండింగ్?లో ఉన్న విషయంపై పవన్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.విజిలెన్స్ పెండింగ్ కేసులపై నివేదికను మూడు వారాల్లో ఇవ్వాలని తెలిపారు. అభియోగాలు వచ్చిన వారిపై విచారణలో తగిన పత్రాలు అందుబాటులో ఉండటం లేదనీ, ఇది విచారణ జాప్యానికి కారణం అవుతోందని అధికారులు వెల్లడించారు. తన శాఖల పరిధిలో అధికారులు, సిబ్బందిపై ఆరోపణలు వస్తే ప్రాథమిక విచారణ పకడ్బందీగా జరపాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

## భారీగా డ్రగ్స్ పట్టివేత
### -రాచకొండ కమిషనరేట్ సీపీ సుధీర్ బాబు

**టి మీడియా,జనవరి 17,హైదరాబాద్:** నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు అంతరాష్ట్ర నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి 190 గ్రాముల హెరాయిన్, ద్విచక్రవాహనం, మొబైల్స్ సహా ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ రూ. 23 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. మీడియాకు రాచకొండ కమిషనరేట్ సీపీ సుధీర్ బాబు వివరాలు తెలిపారు. నిందితులు రాజస్థాన్‌కు చెందిన మహేష్, మహిపాల్ గుర్తించినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో అధిక ధరలకు నిందితులు హెరాయిన్ విక్రయిస్తున్నారని అన్నారు. నిందితులు రాజస్థాన్‌కు చెందిన వారైనా నేరేడ్మెట్ పరిధిలో స్థిరపడ్డారని అన్నారు.వినియోగదారులకు డ్రగ్స్ చేరవేయడంలో డిఫరెంట్ మెథడ్స్ వాడుతున్నారన్నారు. నిందితులు గ్యాస్ సిలిండర్ రిపేర్లు చేసే వారిగా పనిచేస్తున్నారని తెలిపారు. గ్యాస్ రిపేర్‌కు సంబంధించిన పరికరాల్లో ప్యాక్ చేసి డ్రగ్స్ సరఫరా చేస్తున్నారని అన్నారు. గ్యాస్ సిలిండర్ వాల్వ్‌లలో ప్యాక్ చేసి విక్రయిస్తున్నారని తెలిపారు. అనుమానం రాకుండా ఇలాంటి టెక్నిక్స్ వాడుతున్నారని చెప్పారు. వోలా, ఊబర్, రాపిడో సహా ఇతర మార్గాల ద్వారా వీటిని కస్టమర్లకు చేరవేస్తున్నారన్నారు. 200 గ్రాముల హెరాయిన్ లక్ష రూపాయలకు కొనుగోలు చేసి... దానిని దాదాపు రూ. 23 నుంచి 25 లక్షల వరకు విక్రయిస్తున్నారన్నారు.రాజస్థాన్‌కు చెందిన శంషుద్దీన్ అనే డ్రగ్ పెడ్లర్ నుంచి నిందితులు డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. 2024 నుంచి ఇప్పటి వరకు రాచకొండ పరిధిలో దాదాపు రూ. 88 కోట్ల విలువైన డ్రగ్స్ సీజ్ చేశామని తెలిపారు. కమిషనరేట్ పరిధిలో డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు నిరంతరం కృషి చేస్తూనే ఉంటామని చెప్పారు. పిల్లలు, యువత ఇలాంటి మత్తు పదార్థాలకు బలికావద్దంటే... ప్రజల సహకారం కూడా కావాలని చెప్పారు. డ్రగ్స్ సమాచారం ఉంటే తమకు తెలియజేయాలన్నారు. వీటిపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కళాశాలల్లోకి వెళ్లి యాంటీ ర్యాగింగ్, డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. నిన్న జరిగిన కాల్పుల ఘటనకు సంబంధించి తమ కమిషనరేట్ పరిధిలోని పోలీసులు కూడా వారిని పట్టుకునేందుకు చర్యలు చేపట్టారని సీపీ సుధీర్ బాబు తెలిపారు




## కాల్పులు జరిపింది అమిత్‌కుమార్ ముఠానే
### - 10 బృందాలతో గాలింపు
### -నగరంలోకి ప్రవేశించిన బిహార్ ముఠా



**టీ మీడియా, జనవరి 17, హైదరాబాద్ బ్యూరో :** నగరంలో గురువారం కలకలం రేపిన అఫ్జల్‌గంజ్ కాల్పుల కేసులో పోలీసులు ముమ్మర దర్యాప్తు చేస్తున్నారు. 10 స్పెషల్ టీమ్స్?తో హైదరాబాద్ సహా రాయ్‌పూర్, బిహార్‌లోని అనుమానిత ప్రాంతాల్లో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. కాల్పులు జరిపింది బిహార్‌కు చెందిన అమిత్ కుమార్ ముఠాగా పోలీసులు గుర్తించినట్టు సమాచారం. కర్ణాటకలోని బీదర్‌లో దోపిడీకి పాల్పడి అక్కడ ఇద్దరిపై కాల్పులు జరిపి, హైదరాబాద్ నగరంలోకి ప్రవేశించి ఇక్కడి నుంచి రాయ్‌పూర్ మీదుగా పారిపోవాలని ప్రయత్నించినట్టు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు.ట్రావెల్స్ మేనేజర్?పై కాల్పులు ఈ ముఠా హైదరాబాద్‌కు ఎలా చేరుకుంది అనే అంశంపై పోలీసులు దృష్టి సారించారు. అఫ్జల్‌గంజ్‌లోని రోషన్ ట్రావెల్స్ మేనేజర్ జహంగీర్‌పై కాల్పులు జరిపింది బిహార్‌కు చెందిన అమిత్ కుమార్ ముఠాగానే పోలీసులు భావిస్తున్నారు. ఈ ముఠా రాయ్‌పూర్ మీదుగా బిహార్ పారిపోవాలని ప్రయత్నించినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. కాల్పులు జరిపిన ముఠా బిహార్ పారిపోయిందా? లేదా వేరే ఎక్కడికైనా వెళ్లి తలదాచుకున్నారా? అనేకోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. అమిత్‌కుమార్‌గ్యాంగ్ ఈ ముఠాలో ప్రధానంగా అమిత్ కుమార్ కీలకంగా ఉన్నట్టు తెలిసింది. అతనిపై బిహార్‌లో దోపిడీలు, దొంగతనాల వంటి పలు కేసులు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. సీసీఎస్, టాస్క్‌ఫోర్స్, శాంతిభద్రతల విభాగం పోలీసులు నిందితుల ఆచూకీ కోసం వేట కొనసాగిస్తున్నారు. బిహార్ పోలీసులను సంప్రదించి నగర పోలీసు ఉన్నతాధికారులు అమిత్ కుమార్ నేరాల చిట్టా గురించి ఇప్పటికే పూర్తిగా తెలుసుకున్నట్టు తెలుస్తోంది.పాతబస్తీలో హల్?చల్ : కాగా గురువారం కర్ణాటకలోని బీదర్?లో ఏటీఎం దొంగతనం చేసి, ఆపై హైదరాబాద్ పాతబస్తీలో కాల్పులు జరిపి హల్?చల్ చేశారు. బీదర్‌లోని ఓ ఏటీఎంలో డబ్బులు నింపేందుకు వచ్చిన ఇద్దరు సెక్యూరిటీ గార్డులపై కాల్పులు జరిపి, నగదుతో బైక్‌పై పరారై నేరుగా హైదరాబాద్‌లో ప్రత్యక్షమయ్యారు. అఫ్జల్‌గంజ్ నుంచి ప్రైవేట్ ట్రావెల్స్‌లో రాయ్‌పూర్ పారిపోవడానికి తీవ్రంగా ప్రయత్నించారు.ఈ క్రమంలో ట్రావెల్స్ యాజమాన్యం బ్యాగులు తనిఖీ చేయడం, కట్టల కొద్దీ డబ్బును చూసి అనుమానంతో ప్రశ్నించడం వల్ల నిందితులు ట్రావెల్స్ సిబ్బందిలో ఒకరిపై రెండు రౌండ్ల కాల్పులు జరిపి పరారయ్యారు. బీదర్‌లో జరిపిన కాల్పుల్లో ఒకరు మరణించగా, మరొకరు తీవ్రంగా క్షతగాత్రులయ్యారు. సినీ ఫక్కీలో జరిగిన ఈ ఘటన స్థానికులను ఉలిక్కిపడేలా చేసింది. రెండు చోట్లా అత్యంత రద్దీ ప్రదేశాల్లో ఆగంతకులు ఇంతటి నేరానికి పాల్పడి కర్ణాటక, తెలంగాణ పోలీసులకే సవాల్ విసిరారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు

### -గ్రామసభల్లో లబ్దిదారుల జాబితాలు
### త్వరలో సర్వేయర్ల, గ్రామాధికారుల నియామకంలి
### -మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**టి మీడియా,జనవరి 17,హైదరాబాద్బ్యూరో :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం నిరంతర ప్రక్రియ, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇచ్చే బాధ్యత ఈ ప్రభుత్వానిదేనని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మొదటి విడతలో ఇండ్ల స్థలం ఉన్నవారికి , రెండవ విడతలో ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లును నిర్మించి ఇస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, గ్రామాలలో రెవెన్యూ వ్యవస్థ, సర్వేయర్ల నియామకంపై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలోని తన కార్యాలయంలో శుక్రవారంనాడు చీఫ్ సెక్రటరీ శ్రీమతి శాంతికుమారితో కలిసి సమీక్షించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ , హౌసింగ్ సెక్రటరీ జ్యోతి బుద్ధ ప్రకాష్, హౌసింగ్ కార్పోరేషన్ ఎండీ వి.పి. గౌతమ్,జిహెచ్ ఎం సీ కమీషనర్ ఇలంబర్తి, సిఎంఆర్‌వో డైరెక్టర్ మకరంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇంజనీరింగ్ విభాగాన్ని సమకూర్చుకోవడం, ప్రతి రెవెన్యూ గ్రామానికి రెవెన్యూ అధికారి నియామకం, సర్వేయర్ల నియామకంపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాసరెడ్డి గారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లకు అర్హులైన లబ్దిదారులకు సంబంధించిన నివాస స్థలం ఉన్నవారి జాబితా, నివాస స్థలం లేని వారి జాబితా రెండు జాబితాలను గ్రామసభల్లో పెట్టాలని అధికారులకు సూచించారు. దశల వారీగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామని తెలిపారు. ప్రస్తుతం హౌసింగ్ కార్పొరేషన్‌లో 274 మంది ఇంజనీర్లు మాత్రమే ఉన్నారని రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం , పర్యవేక్షణకు మరో 400 మంది ఇంజనీర్లు అవసరమని ఈ సందర్భంగా అధికారులు మంత్రిగారి దృష్టికి తీసుకువచ్చారు. ఇతర ప్రభుత్వ విభాగాలలో ఇంజనీరింగ్ సిబ్బంది సేవలను ఏవిధంగఉపయోగించుకోవచ్చు వంటి అంశాలను పరిశీలించాలని ఈ సందర్భంగా మంత్రిగారు సిఎస్ గారికి సూచించారు.గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో ఇండ్ల నిర్మాణానికి సంబంధించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. విలేజీ రెవెన్యూ వ్యవస్థకు సంబంధించి ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమిస్తామని ఇందుకోసం విఆర్వో, విఆర్ఎ నుంచి అర్హులైన వారిని ఎంపిక చేసి ప్రత్యేకంగా పరీక్ష నిర్వహించాలని, ఈ పరీక్షకు సంబంధించిన విధివిధానాలను తక్షణమే రూపొందించి పరీక్ష నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 450 మంది సర్వేయర్లు ఉన్నారని అదనంగా మరో వెయ్యి మంది సర్వేయర్లు అవసరమున్న నేపథ్యంలో సర్వేయర్ల ఎంపికకు కావలసిన ప్రణాళిక తయారు చేయాలని ఎంపిక విధానం పారదర్శకంగా ఉండాలని అధికారులకు సూచించారు.

## సంతానం లేని దంపతులకు వరం

### -ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా ఐవీఎఫ్ సేవలు

**టీ మీడియా, జనవరి 17, హైదరాబాద్ బ్యూరో:**దేశంలో సంతాన లేమితో బాధపడేవారి సంఖ్య రోజు రోజుకీ పెరిగిపోతోంది. అందుకు తగ్గట్టుగానే వీధికో సంతాన సాఫల్య కేంద్రాలు ఏర్పాటవుతున్నాయి. అయితే వాటిల్లో చికిత్స అన్ని వర్గాలవారికి అందుబాటులో ఉండకపోవచ్చు. అలాంటి వారికి ఇక చింత అక్కర్లేదు. సంతానం లేని దంపతులకు తెలంగాణ ప్రభుత్వం కొత్తగా%౾%ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రవేశపెట్టిన సంతాన సౌఫల్య కేంద్రం మంచి ఫలితాలనిస్తోంది. ఐవిఎఫ్ సెంటర్ ద్వారా పేట్ల బురుజు ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో ముగ్గురు మహిళలకు విజయవంతమైనట్లు ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ రజిని రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం రోజు ఆమె విలేకరుల సమావేశంలో వివరించారు.ఆస్పత్రిలోని సంతాన సౌఫల్య కేంద్రం ఐవిఎఫ్ సెంటర్‌కు 20 మంది పేర్లు నమోదు చేసుకోగా అందులో శంషాబాద్, నారాయణఖేడ్, హైదరాబాద్లోని పాతబస్తీకి చెందిన ముగ్గురు మహిళలకు మూడు నెలల చికిత్స అనంతరం విజయవంతమైనట్లు ఆమె వివరించారు. సంతానం లేని దంపతులు ప్రైవేట్ ఆస్పత్రులను కాకుండా ప్రభుత్వాసుపత్రిలో సంతాన సౌఫల్య కేంద్రం ఐవిఎఫ్ సెంటర్ ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ విజయం వెనుక ఆసుపత్రి డాక్టర్లు సిబ్బంది కృషి ఎంతో ఉందని ఆమె అన్నారు. ఈ సమావేశంలో ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ అమృతలక్ష్మి, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ తరహా సౌకర్యాలను అందించటం ప్రజల ఆదరణకు తోడ్పడుతుందని సాంకేతికత, నిపుణుల శ్రద్ధతో ఇలాంటి విజయం సాధించగలగడం చాలా గర్వంగా ఉందని వైద్యులు పేర్కొన్నారు. ప్రజలు ప్రైవేట్ హాస్పిటల్స్‌కు వెళ్లి లక్షల కొద్ది డబ్బులు ఖర్చు పెట్టుకుని చివరికి ప్రభుత్వ హాస్పిటల్‌కి వస్తున్నారని వైద్యులు తెలిపారు. ఇలాంటి అవకాశాన్ని సమస్య ఉన్న ప్రతి దంపతులు వినియోగించుకోవాలని సూచించారు. సంతానం కోసం ఎన్నో హాస్పిటళ్లకు తిరిగి ఆర్థికంగా నష్టపోయామని ఇక్కడికి వచ్చాక తమ ప్రయత్నం ఫలించిందని దంపతులు ఆనందం వ్యక్తం చేశారు.

## ఘనంగా 77వ పుట్టిన రోజు వేడుకలు

**టీ మీడియా, జనవరి 17, మెదక్ :** ఎవరో వస్తారు. ఏదో చేస్తారని ఎదురు చూడకుండా, సమిష్టిగా ముందుకు సాగుతూ సత్ఫలితాలు పొందుతూ ఆదర్శంగా నిలుస్తోంది ఈ గ్రామం. అక్కడి గ్రామ ప్రజలు నేను, నాది అనే భావన కాకుండా మనం, మనది అనే భావనతో ఏకతాటి మీద నడుస్తూ వివిధ రంగాల్లో స్థిరపడి రాణిస్తున్నారు. వెల్ఫేర్ సొసైటీ ఏర్పాటు చేసుకొని గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుంటూ ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుపుతున్నారు. ఆ గ్రామమే మెదక్ జిల్లాలోని లక్ష్మీనగర్.ఒకప్పుడు లక్ష్మీనగర్ అనేది అటవీ ప్రాంతం. రాళ్లూ రప్పలతో ఉండేది. ప్రస్తుతం మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలో ఉంది. 1948-1950 మధ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రకాశం, గుంటూరు, ఒంగోలు, తెనాలి ప్రాంతాలకు చెందిన 14 కుటుంబాల వారు లక్ష్మీనగర్‌కు తరలివచ్చి అక్కడే గుడిసెలు వేసుకొని నివాసం ఏర్పాటు చేసుకున్నారు. అప్పట్లో వారు బీడు భూములను కొనుక్కొని వరి సాగు చేస్తూ జీవనం సాగిస్తుండేవారు. 1995 లక్ష్మీనగర్ గ్రామ పంచాయతీగా ఆవిర్భవించింది. మొదటి సర్పంచ్‌గా రాజ్యలక్ష్మి ఎన్నికవ్వగా, గ్రామ ప్రజలందరూ చందాలు జమ చేసుకొని స్థలం కొనుగోలు చేసి పంచాయతీ భవనాన్ని నిర్మించుకున్నారు.ప్రస్తుతం ఈ గ్రామంలో దాదాపు 225 కుటుంబాలు 1200 మంది పైచిలుకు జనాభా నివాసం ఉంటుంది. కంటమనేని రత్తయ్య లక్ష్మీ నర్సమ్మ చొరవతో లక్ష్మీనగర్ అనే గ్రామం ఏర్పడింది. ఈ గ్రామానికి చెందిన పెండ్యాల ప్రసాద్ గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో తరచూ గ్రామస్థులతో సమావేశం నిర్వహించి చైతన్య పరిచేవారు. ప్రజలందరి సహకారంతో పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఆరోగ్య, అభివృద్ధితో ఆదర్శ గ్రామంగా తయారు చేయడం లక్ష్యంగా 2014లో 11 మందితో లక్ష్మీనగర్ వెల్ఫేర్ సొసైటీ ఏర్పాటైంది. గ్రామానికి చెందిన డాక్టర్లు, ఇంజినీర్లు, సాఫ్ట్‌వేర్లు తదితర రంగాలకు చెందిన వారితో వెల్ఫేర్ సొసైటీ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు.హరితహారం చేపట్టిన గ్రామం : వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్, మిల్క్ సొసైటీ ఏర్పాటయ్యాయి. అలాగే ప్రగతి భవన్ నిర్మాణాన్ని కూడా చేపట్టారు. విద్యావంతులు, యువకులు క్రియాశీలకంగా పనిచేసే వారితో పరిశుభ్రత, హరితహారం, ఆలయ వేడుకల నిర్వహణ వివిధ కమిటీలను కూడా ఏర్పాటు చేయడం జరిగింది. హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఇంటింటికీ జామ, అరటి, మామిడి, సపోటా, కొబ్బరి వివిధ రకాల పూల మొక్కలను పెంచుకోవడం విశేషం. అలాగే గ్రామంలో సాధ్యమైనంత వరకు వివిధ కూరగాయలు, ఆకు కూరలను సేంద్రీయ పద్ధతిలో పండించుకుంటున్నారు. ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి ముప్పు ఏర్పడుతున్న ఉద్దేశం కొద్దీ గ్రామంలో ప్లాస్టిక్ నిషేధంతో పాటు మద్యపాన నిషేధం కూడా అమలు చేశారు. అలాగే భూగర్భ జలాలు ఇంకాలని ప్రతి ఒక్క ఇంటికీ ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకున్నారు.

లక్ష్మీనగర్ 77వ పుట్టినరోజు ఇక్కడ ఇంకో విశేషం ఏంటంటే ప్రతి సంక్రాంతికి లక్ష్మీనగర్ గ్రామ పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఆరోజు గ్రామస్థులందరూ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఒకేచోట చేరి ఆనందోత్సాహాల మధ్య కేక్ కట్ చేస్తారు. ఈ సందర్భంగా గడిచిన ఏడాది కాలంలో గ్రామాభివృద్ధి కోసం చేపట్టిన కార్యక్రమాల గురించి సమీక్షించడంతో పాటు ఏడాదిలో చేపట్టబోయే కార్యక్రమాల గురించి చర్చించి ప్రణాళిక రూపొందిస్తారు.

ఫ్లోరైడ్ సమస్య అధిగమించిన గ్రామం అలాగే సంవత్సర కాలంలో చనిపోయిన వారిని గుర్తు చేసుకుంటూ, వారికి శ్రద్ధాంజలి ఘటిస్తారు. సామూహిక సంక్రాంతి సంబురాలు నిర్వహించడంతో పాటు ఆనవాయితీ ప్రకారం గ్రామంలో మహిళలకు ముగ్గులు, ఆటల పోటీలు, సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తారు. ఈ గ్రామం నుంచి దాదాపుగా 30 మంది విదేశాల్లో స్థిరపడటం విశేషం. నీటి ఎద్దడి, ఫ్లోరైడ్ సమస్య విపరీతంగా ఉండటంతో బాల వికాస సంస్థ సహకారంతో 2015లో నీటి శుద్ధి ప్లాంటు ఏర్పాటు చేసుకుని ఆ సమస్యను అధిగమించారు.

## హ్యాండ్ బాల్ జట్టు కోచ్ గా ఉమా శంకర్



**టీ మీడియా, జనవరి 17, వనపర్తి బ్యూరో :** ఈ నెల 18 నుండి 21 వరకు కరీంనగర్ జిల్లాలోని అంబేద్కర్ స్టేడియంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో ఉమ్మడి మహబూబ్ నగర్ హ్యాండ్ బాల్ జట్టుకు ఉమా శంకర్ కోచ్ ఎంపికయ్యారని సంయుక్త మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ తకియుద్దీన్ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్ తెలియజేశారు.

## రాష్ట్ర ప్రజలకు ఇకపై అన్నీ మంచి రోజులే

-ముఖ్యమంత్రి చంద్రబాబు

**టీ మీడియా, జనవరి 17, అమరావతి బ్యూరో :** విశాఖ స్టీల్ ప్లాంటుకు కేంద్ర ప్యాకేజీ ప్రకటించడం చరిత్రాత్మక నిర్ణయమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఇది ఏపీ ప్రజలు గర్వించదగ్గ విషయమన్న సీఎం ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. నిర్మలా సీతారామన్, కుమారస్వామికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విశాఖ ఉక్కు అంటే కేవలం పరిశ్రమ మాత్రమే కాదని దానికి ఆంధ్రుల హృదయాల్లో ప్రత్యేక స్థానం ఉందన్నారు. రాష్ట్ర ప్రజలకు ఇకపై అన్నీ మంచి రోజులేనని తెలిపారు.ఏపీ ప్రజలకు ఇచ్చిన హామీని ఎన్డీయే ప్రభుత్వం అమలు చేసిందని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. విశాఖ ప్లాంటు కార్మికులు, కుటుంబాలకు భద్రతే ధ్యేయంగా కేంద్రం చర్యలు ప్రారంభించిందన్నారు. ప్లాంట్‌ను మరింత సమర్థంగా నడిపించాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. ఏపీ ప్రజలు ఉద్యమాలు చేసి స్టీల్ ప్లాంట్‌ను సాధించుకున్నారని గుర్తు చేశారు. ప్లాంటు విషయంలో చంద్రబాబు, నిర్మలాసీతారామన్ కీలకపాత్ర పోషించారని తెలిపారు.